క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. మోక్ష విల్లాస్, విశాల్‌మార్ట్, ట్రివీ స్కూల్, శ్రీచైతన్య స్కూల్, సాయినగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు, రేపు ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశాలు

వరంగల్ చౌరస్తా: జనగామ జిల్లా పాలకుర్తి శుభం ఫంక్షన్ హాల్‌లో ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలను ఈనెల 29, 30వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఒక ప్రకటనలో తెలిపారు. కష్టజీవులు రాజ్యాధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే సమానంగా సంపద పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాధికారం కోసం ప్రజా పోరాటాలకు సమాయత్తం కావడానికి ఈ రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు.

రేపు చెస్ గ్రాండ్‌మాస్టర్ అర్జున్‌కు సన్మానం

నయీంనగర్: ప్రపంచస్థాయి చెస్ చాంపియన్ ఇరిగేసి అర్జున్‌కు చెస్ నెట్‌వర్క్ వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో శనివారం సన్మానించనున్నట్లు చెస్ నెట్‌వర్క్ సెక్రటరీ టీడీ.టామీ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో కోదాటి సుధీర్, స్వామి రావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నయీంనగర్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏదలాపురం సనత్‌కుమార్ చారి నియమితులయ్యారు. ఈమేరకు బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ యాదవ్ గురువారం పేర్కొన్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

సమాన వేతనం చెల్లించాలి



హసన్‌పర్తి: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హసన్‌పర్తిలో కేజీబీవీ విద్యాలయంలో గురువారం భోజన విరామం సమయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యదర్శి బి.సుధారాణి, స్పెషల్ ఆఫీసర్ అనిత, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆన్ఆర్ఐ సామల అశోక్‌కుమార్, గునిశెట్టి రజనీకాంత్ ఆధ్వర్యంలో చల్లని ఫౌండేషన్ బాధ్యులు సుద్దాల నాగరాజు, గజ్జ చందు సహకారంతో అనాథలు, నిరుపేదలకు గురువారం దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైదం రవ్వన్న, ఎండీ.యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ముళ్లకంప తొలగింపు

ఖిలా వరంగల్: శివనగర్‌లోని హిందూ శ్మశాన వాటికలో ముళ్ల పొదలను తొలగించారు. ప్రజల అభ్యర్థన మేరకు 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ గురువారం స్పందించారు. బల్దియా ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో పరిసరాలను శుభ్రం చేశారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

హసన్‌పర్తి: నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ దయాకర్ అన్నారు. హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, జనగాని సంతోష్, రేణుకుంట్ల ప్రవీణ్, రాజ్‌కుమార్, కుమారస్వామి, రమేష్, కొత్తకొండ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌ను కోర్టులో హాజరుపర్చాలి

వరంగల్: సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అజ్ఞాత దళ కమాండర్ కామ్రేడ్ పూనెం రమేష్‌ను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని పార్టీ వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు ఒక ప్రకటనలో కోరారు. కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మర్రిగూడెం గ్రామపంచాయతీ ఎల్లాపురం శివారులో గురువారం సాయంత్రం రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. గోదావరిలో ప్రతిఘటన ఉద్యమంలో ఆదివాసీ, దళిత, గిరిజన, పీడిత ప్రజల కోసం రమేష్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

పత్తి పంట పరిశీలన

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న ఆధ్వర్యంలో పత్తిపంటను శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంటను సాగు చేయడం వలన కూలీల ఖర్చు తగ్గుతుందని వారు తెలిపారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌నారాయణ, సుబ్రహ్మణ్యం, పుటే, సైని, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, రైతులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్.. కార్మికులకు భరోసా



అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కాయకష్టాన్నే నమ్ముకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు విశ్రాంతి లేకుండా పనిచేసే కార్మికులకు ఈ – శ్రమ్‌తో భరోసా ఇస్తోంది. ఆపత్కాలంలో వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తోంది. అవగాహన లేకపోవడంతో జిల్లాలో ఇంకా చాలామంది ఈ – శ్రమ్ కార్డును పొందలేదు. వారు కూడా వివరాలు నమోదు చేసుకుంటే బీమాకు అర్హులవుతారని అధికారులు సూచిస్తున్నారు.

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 8లక్షల వరకు అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని అధికారుల అంచనా. వారిలో ఇప్పటి వరకు సగం మంది కార్మికులు మాత్రమే ఈ – శ్రమ్ కార్డులు పొందారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న మిగిలిన వారు నమోదు చేసుకోవాల్సి ఉంది. కార్డుదారులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షలు ఆర్థిక సాయం అందుతుంది. ఏదైనా ప్రమాదంలో 50 శాతానికి మించి అంగవైకల్యం సంభవిస్తే రూ.లక్ష చేయూతనందిస్తారు.

నమోదుకు ఇవి గుర్తుంచుకోండి

ఈ-శ్రమ్ కార్డు పొందేందుకు www.eshram.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలి. దీనికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఆ వివరాలు నమోదు చేస్తే యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఏఎన్) కార్డు జారీ చేస్తారు. సెల్‌ఫోన్ నుంచి కూడా వివరాలను నమోదు చేసుకుని కార్డును పొందవచ్చు.

ఈకేవైసీ కలిగిన ఆధార్, ఆధార్‌తో అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబర్ ఉండాలి. వెబ్‌సైట్‌లో ఆధార్ వివరాలు పొందుపరచగానే వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) వస్తుంది. ఓటీపీ సదుపాయం లేకపోతే బయోమెట్రిక్, ఐరిస్, బ్యాంకు ఖాతా వివరాల ద్వారా ఇంటర్నెట్ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి.

అర్హులు ఎవరంటే..

18 ఏళ్ల నుంచి 59 సంవత్సరాలు వయసు మధ్యలో ఉండి అసంఘటిత రంగాల్లో పని చేస్తున్నవారు. రూ.15 వేల కంటే తక్కువ వేతనం పొందుతున్న తాపీమేస్త్రీలు, వడ్రంగి, పెయింటర్లు, రాడ్ బైండింగ్, సెంట్రింగ్, ప్లంబింగ్ పనులు చేసేవారు. మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లు, బావులు తవ్వేవారు, పూడిక తీసేవారు, కలప పనివారు, చిప్స్ ప్యాకింగ్ చేసేవారు, కళాసీ, వాచ్‌మెన్లు, క్వారీ కార్మికులు, మార్బుల్, రోడ్డు నిర్మాణం, ఇటుక బట్టీల్లో పనిచేసేవారు. రజకులు, స్వర్ణకారులు, కమ్మరి, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్రైవర్లు తదితరులు ఈ – శ్రమ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రజాపాలన విజయోత్సవంలో వరంగల్ కలెక్టర్ సత్య శారద



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ కలెక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా కాకతీయ మెడికల్ కాలేజీలోని ఎన్నారై మిలీనియం ఆడిటోరియంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీపీఆర్‌ఓ అయుబ్‌అలీతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఇందులో భాగంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి భాగ్యలక్ష్మి, తహసీల్దార్ ఇక్బాల్, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను చాటుతూ ప్రముఖ రాష్ట్ర జానపద కళాకారుడు అంతడుపుల నాగరాజు బృందం నృత్య రూపకం ప్రదర్శించింది. తెలంగాణ అమరవీరులు, కవులు, కళాకారులు, పల్లెసంస్కృతి, గ్రామదేవతల బోనాలు, పోతరాజుల విన్యాసాలు, గణపతి నవ రాత్రులు, బతుకమ్మ వేడుకలు, పీరీలు, దేశభక్తి, సమ్మక్క–సారలమ్మ పూజలను ప్రతిబింబిస్తూ కళాకారులు తమ అభినయాలతో అలరించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కళాకారుడు చక్రాల రఘు బృందం, సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలతో ఆడిటోరియం మార్మోగింది.

రక్తదానం చేయడం బాధ్యతగా గుర్తించాలి

వరంగల్: తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం చేయడం ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో తెలంగాణ పాడుపు, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్, అభయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ పర్యవేక్షణలో జరిగిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సత్య శారద ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ ఉప్పుల శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హస్తకళల్లో రాణిస్తే మంచి భవిష్యత్

ఖిలా వరంగల్: హస్తకళల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని, కాకతీయుల స్ఫూర్తితో ప్రత్యేక విగ్రహాలను రూపొందించాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు నాగేంద్రనగర్, ఖమ్మం రోడ్డులో నాబార్డ్, మారి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాబార్డు డీడీఎం రవి అధ్యక్షతన గురువారం బ్రాస్ క్లస్టర్ శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. నాబర్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్, ప్రణయ్‌కుమార్, శ్యాంరావు, రాగి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'

- సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి



మాట్లాడుతున్న హైమావతి

కాజీపేట అర్బన్: ఆదపలో మహిళలు, బాలికలకు సఖి సెంటర్ అండగా ఉంటోందని సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి తెలిపారు. ప్రపంచ మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కాజీపేట మండలంలోని కుమ్మరిగూడెం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలపై హింస రహిత సమాజ నిర్మాణానికి సఖి కేంద్రం సేవలందిస్తోందని వివరించారు. బాధిత మహిళలకు తాత్కాలిక వసతి, పోలీస్, న్యాయ, వైద్య సేవలతో పాటు కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు 181, 73829 83088, 0870 – 2452112 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కేస్ వర్కర్ వినీల పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ జోన్‌పై హర్షం



నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్ గ్రీన్ జోన్‌లో ఉన్న 100 ఎకరాల భూమిని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నాగరాజు మాట్లాడుతూ పదేళ్లుగా తమ భూములు గ్రీన్ జోన్‌లో ఉన్నాయని గత ఎమ్మెల్యేకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. తాజాగా కుడా చైర్మన్ ప్రత్యేక చొరవ తీసుకుని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చినందుకు కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్, కిషన్, అశోక్, యాదగిరి, రవీందర్‌రెడ్డి, సదాశివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

నయీంనగర్: 2030 నాటికి బాల్య వివాహాలు లేని దేశంగా భారత్‌ను మార్చాలనే ఉద్దేశంతో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని కేంద్రం నిర్వహిస్తోందని, అందుకోసం షేర్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోందని కోఆర్డినేటర్ టి.శిరీష తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం ఒక సామాజిక దురాచారం అని, బాల్య వివాహాలను నిర్మూలించడం అందరి బాధ్యత అని గుర్తుచేశారు. బాల్య వివాహాలతో బాలికల బంగారు భవిష్యత్ నాశనం అవుతోందని వరంగల్, హనుమకొండలోని వివిధ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల సమాచారం తెలిస్తే 100, 1098 నంబర్లకు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.రాజేష్, ప్రశాంతి, జ్ఞానేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మలిదశ తొలి ఉద్యమ అమరుడు పోలీస్ కిష్టయ్య

కాజీపేట అర్బన్: తెలంగాణ మలిదశ తొలి ఉద్యమ అమరుడు పుట్టకొక్కుల కిష్టయ్య ముదిరాజ్ (పోలీస్ కిష్టయ్య) వర్ధంతిని ఘనంగా జరుపుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈమేరకు హంటర్ రోడ్డులోని ముదిరాజ్ మహాసభ కార్యాలయంలో క్రిష్టయ్య వర్ధంతి కార్యక్రమ వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, చొప్పరి సమ్మయ్య, శానబోయిన రాజ్‌కుమార్, సదయ్య, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సామాజిక భద్రతకు కేంద్రం కృషి

కాజీపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత, బీమా పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్‌సీ జిల్లా కౌన్సిలర్ భాస్కరాచారి సూచించారు. కాజీపేట మహిళా సమాఖ్య భవనంలో శ్రీధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎం కిషన్, ప్రియాంక, పావని, హర్షిత, రమేష్, ముబీన్ ఖాన్, రమాదేవి, రజిత, మాధురి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగడ్డలో మృతదేహంతో రాస్తారోకో

- శ్మశానవాటికలో అంత్యక్రియలను అడ్డుకున్నారని దళితుల ఆగ్రహం



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న దళితులు

హన్మకొండ చౌరస్తా: దళితుల శ్మశాన వాటికను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, రాజకీయ, పోలీసుల అండదండలతో సమాధులు కూల్చివేస్తున్నారంటూ దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు పెద్దమ్మగడ్డ కెనాల్ బ్రిడ్జిపై మృతదేహంతో గురువారం రాస్తారోకో చేశారు. పెద్దమ్మగడ్డకు చెందిన వృద్ధురాలు రిపికి కనుకమ్మ(80) చనిపోవడంతో అంత్యక్రియల కోసం తరతరాలుగా అంత్యక్రియలు నిర్వహిస్తున్న కెనాల్ సమీపంలోని శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. అక్కడ కొంతమంది అంత్యక్రియలకు అడ్డు తగలడంతో మృతురాలి కుటుంబీకులు, బంధువులు, స్థానికులు రోడ్డుపై రాస్తారోకో చేశారు. సమాధులను ధ్వంసం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, శ్మశానవాటికను పరిరక్షించాలని కోరారు. ఈక్రమంలో ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పి, అంత్యక్రియలు జరిగేలా చూశారు.

గోపాలపురంలో అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీసీఓ నీరజ, అతిథులు

హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురంలో వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ సేవలు గురువారం సేవలు ప్రారంభమయ్యాయి. జిల్లా సహకార అధికారి ఎం.నీరజ ముఖ్యఅతిథిగా పాల్గొని మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావుతో కలిసి బ్యాంక్ శాఖను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బ్యాంక్ నూతన శాఖ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ బ్యాంకింగ్ రంగంలో అగ్రగామిగా నిలుస్తోందని వివరించారు. 1994లో జిల్లాలో స్థాపించిన ఈ బ్యాంక్ ఇప్పటివరకు రూ.400 వేల కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీష్‌బాబు, కోఆపరేటివ్ అధికారి జగన్మోహన్‌రావు, బ్యాంక్ వైస్ చైర్మన్ తోట జగన్నాథం, బ్యాంక్ ఫౌండర్, డైరెక్టర్ బూర ముత్తిలింగం, బ్యాంక్ డైరెక్టర్లు డాక్టర్ పవన్‌కుమార్, పొన్నాల హరినాథ్, గౌసొద్దీన్, మంద స్వప్న, కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, సీతఈఓ సత్యనారాయణ, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

1న దివ్యాంగుల సమ్మేళనం

విద్యారణ్యపురి: హైదరాబాద్‌లోని ప్రకాశ్‌హాల్ గాంధీభవన్ ప్రాంగణంలో డిసెంబర్ 1న నిర్వహించనున్న దివ్యాంగ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ పిలుపునిచ్చారు. హనుమకొండలో గురువారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆత్మీయ సమ్మేళన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు నున్న నరసమ్మ, వల్లపురెడ్డి వాసుదేవరెడ్డి, ఆకారపు స్వరూప, మహ్మద్ ఫసియొద్దీన్, రవీందర్, కడుదుల సోమన్న, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

హన్మకొండ అర్బన్: రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను హనుమకొండ జిల్లా టీఎన్జీఓఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యామ్‌సుందర్, కత్తి రమేష్, రామునాయక్, మొయిజ్, జిల్లా బాధ్యులు ప్రణయ్, పృథ్వీ, మన్సూర్, రాజు, రాజేంద్రప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఓబీసీ గణన చేయాలి

నయీంనగర్: కేంద్ర ప్రభుత్వం ఓబీసీ జనగణన చేపట్టాలని, లేకుంటే జనరల్ స్థానాల్లో 50 శాతం సీట్లు బీసీలకే కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్‌యాదవ్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పులి శ్రీనివాస్, రాజు ముదిరాజ్, చిరంజీవి, రాఖీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు జర్నలిస్ట్ సాగర్ మృతి



సాగర్ (ఫైల్)

వరంగల్: గ్రేటర్ వరంగల్ 14 డివిజన్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన వరంగల్ తూర్పులోని ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు ఆడెపు సాగర్ గురువారం ఉదయం ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య, కుమార్తె ఉంది. సాగర్ మృతిపై జర్నలిస్టు సంఘాల నాయకులు, తూర్పు జర్నలిస్టులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

వరంగల్ అర్బన్: జర్నలిస్టు ఆడెపు సాగర్ మృతికి వరంగల్ తూర్పు జర్నలిస్టులు నివాళులర్పించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో జర్నలిస్టులు గురువారం ర్యాలీ నిర్వహించి, సాగర్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అలాగే, బల్దియా జేఏసీ నాయకులు బొట్ల రమేష్, రాజారపు భాస్కర్, జీవన్ కుమార్, మోరె రమేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు బాబు, తదితరులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన బంజారా నేతలు

హన్మకొండ: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను హైదరాబాద్‌లో బంజారా నాయకులు గురువారం కలిశారు. బంజారాల ధార్మిక వ్యాప్తి సమ్మేళనానికి హాజరు కావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, బంజారా నాయకులు డీటీ.నాయక్, అమర్‌సింగ్ తిలావత్, ఉద్యోగ సంఘాల నాయకులు రాంచందర్ నాయక్, మోహన్ సింగ్ నాయక్, రాజు నాయక్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం ప్రారంభం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం నిత్యామహాన్నదాన కార్యక్రమాన్ని అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు బుర్ర జనార్ధన్ గౌడ్ ప్రారంభించారు. ఆలయ అర్చకుడు ఉడుతల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించిన అనంతరం అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు.

నారాయణ పాఠశాలలో ప్రీమియర్ లీగ్

మడికొండ: మడికొండ శివారులోని నారాయణ పాఠశాలలో ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల ద్వారా క్రమశిక్షణ, అంకితభావం అలవడుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బి.మనోజ్‌కుమార్, డిప్యూటీ ఫైర్ ఆఫీసర్ శంకర్ లింగం, జోనల్ డీజీఎం రిజ్వాన, క్లస్టర్ ప్రిన్సిపాల్ ములుపోజు శ్రీనివాసాచారి, జోనల్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సంఘాలు కీలకం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

న్యూశాయంపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాసంఘాల పాత్ర కీలకమని, ఆ దిశగా ఉద్యమించాలని, పార్టీ విస్తరణకు పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా సీపీఐ అనుబంధ సంఘాల స్టడీ సర్కిల్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజాసంఘాలు కీలకపాత్ర పోషించాయని గుర్తుచేశారు. ఎల్లేష్, స్టాలిన్, రాములు, ఎం.భిక్షపతి, సంతోష్, రమాదేవి, సదానందం, రవి, సారంగపాణి, రాజుగౌడ్, దీనా, లలిత, రాజేందర్, రమాదేవి, చరణ్, వినయ్ పాల్గొన్నారు.

6న ర్యాలీ, సభను జయప్రదం చేయండి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

వరంగల్: నగరంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 6వ తేదీన ఏజే మిల్లు గ్రౌండ్ నుంచి నిర్వహించనున్న ర్యాలీ, పోచమ్మమైదాన్‌లో జరగనున్న సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అకినపెల్లి యాదగిరి పిలుపునిచ్చారు. ఈమేరకు ఏనుమాముల మార్కెట్ నుంచి ప్రారంభమైన ర్యాలీని ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారను. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారాన్ని చేపట్టినా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదని వాపోయారు. ర్యాలీలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నైనాలశెట్టి మూర్తి, నాయకులు రావిరాకుల ప్రసంగి, ప్రవీణ్, ఎస్‌కే.పాషా, కంది రవి, పోలబోయిన శ్రీనివాస్, ఏనుగంటి రాజలింగం, గౌస్‌పాషా, పట్టెం మొగిలి, సదయ్య, శంకరాచారి, సముద్రాల ఇస్తారి, ఓంకార్, కానుగంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

మడికొండ: డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు మడికొండలో గురువారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్, జానపట్ల సారయ్య, బండారి మహేందర్, దాసరి వీరేష్, వంగాల శరత్, ఎలగొండ శివ, గుండాల రమేష్, మద్దెల కుమార్, మాజీ ఎంపీపీ అంకేశ్వరపు కుమారస్వామి, కట్ట రాజ్‌కుమార్, బాబు, కాశీశ్వరపు భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబా పూలేకు ఘన నివాళి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతిని నగర వ్యాప్తంగా గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



బాలసముద్రంలో పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి



దూరవిద్య కేంద్రంలో పూలేకు నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, తదితరులు



బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



జానపద గిరిజన విజ్ఞానపీఠంలో పీఠాధిపతి ప్రొఫెసర్ బాబురావు, సిబ్బంది



పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్, బాధ్యులు